క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: సీఎంఆర్‌ఎఫ్ నిరు పేదలకు భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కోస్గి మండలం ముంగిమళ్ల గ్రామానికి చెందిన సింధూజ కుటుంబ సభ్యులకు రూ.1.25 లక్షల ఎల్‌ఓసీ చెక్కును అందజేసి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏఎంసీ డైరెక్టర్ బాకారం అరుణ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతల పూడ్చివేత


మొరంతో గుంతలు పూడుస్తున్న కూలీలు

మర్పల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు మర్పల్లి నుంచి సంగారెడ్డి జిల్లా బుదేర సరిహద్దు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డులో గంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారిందని పట్లూర్ సర్పంచ్ ఇందిర అన్నారు. ఈ విషయమై ఆర్ అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారు పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. ప్రజా రవాణానాను దృష్టిలో ఉంచుకొని మొరంతో గుంతలు పూడ్చివేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతల రోడ్డును మరమ్మతు చేయించాలని ఆమె కోరారు.

వసతి గృహంలో సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీల పనితీరును పరిశీలిస్తున్న వీరానందం

యాలాల: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలను ఆదివారం ఏర్పాటు చేశారు. వసతి గృహ ప్రధాన ద్వారంతో పాటు కిచెన్, ఆఫీస్, వరండా, గార్డెన్ తదితర ప్రాంతాలను పరిశీలించేందుకు వీలుగా ఆరు సీసీలను ఏర్పాటు చేయించినట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం తెలిపారు. కెమెరాలతో పాటు వసతి గృహంలోని విద్యార్థుల కోసం తలగడలు, బెడ్లు(మ్యాట్రిస్) అందజేశామన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేశ్


నియామకపత్రం అందజేస్తున్న విజయరాజ్

వికారాబాద్ అర్బన్: బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వికారాబాద్ పట్టణం గంగారానికి చెందిన ల్యాగల నరేశ్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విజయరాజ్ నియామకపత్రం అందజేశారు. సందర్భంగా నరేశ్ మాట్లాడారు. తనపై నమ్మకంతో యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతతో పనిచేసి, తన వంతుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీమోర్చా అధ్యక్షుడు నవీన్, శంకర్, యాదగిరి, సాయి ఉన్నారు.

ఎన్నికల కోసమే ఎమ్మెల్యే 'బస్తీబాట'

పరిగి: బస్తీబాట అంటూ గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి.. బస్తీ మొత్తం తిరగకుండానే వెళ్లి పోవడం సరికాదని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని 10వ వార్డులో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నగర్ కాలనీ కొంత మేర తిరిగి వెళ్లారని ఆరోపించారు. మిగతా ప్రాంతాలైన విద్యారణ్యపురి, కిష్టమ్మగుడితండా ప్రజల సమస్యలు తెలుసుకోకుండానే పర్యటన ముగించడంతో ఆయన మండిపడ్డారు. ప్రజాప్రతినిధి అంటే ప్రతి ఒక్కరి సమస్యలను విని, పరిష్కరించాలని హితవు పలికారు. కానీ పార్టీల వారీగా వార్డులను విభజించి, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు నిధులు కేటాయించి, మిగతా వారికి ఇవ్వక పోవటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 10వ వార్డులో మొత్తం పర్యటిస్తే ఎన్ని సమస్యలు ఉన్నాయో చూపిస్తామని ఆయన చెప్పారు. మున్సిపాలిటీకి నిధులు వచ్చాయని చెప్పడం బూటకమని, కేవలం ఎన్నికల జిమ్మిక్కులో భాగమేనని విమర్శించారు.

పేరుకే క్రీడా ప్రాంగణం

బోర్డులే తప్ప.. మైదానాల్లేవ్!

- రాళ్లురప్పలు, చెత్తదిబ్బలతో దర్శనం
- పట్టించుకోని అధికారులు
- ఎంపీడీఓ కార్యాలయానికి చేరిన స్పోర్ట్స్ కిట్లు
- బిల్లులు అందలేదంటున్న సర్పంచులు


బోర్డుకే పరిమితమైన కందనెల్లితండా క్రీడా ప్రాంగణం

పెద్దేముల్: గ్రామీణ క్రీడా కారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ అధికారుల నిర్లక్ష్యం వలన మండలంలో పథకం నీరుగారిపోతోంది. కొన్ని చోట్ల పనులు పూర్తిగాక, మరి కొన్ని చోట్ల ప్రారంభానికి నోచుకోకపోవడంతో యువత నిరుత్సాహం చెందుతోంది. పలు గ్రామ పంచాయతీల్లో పేరుకు ఏర్పాటు చేసినా.. ఆ ప్రాంగణాల్లో రాళ్ల రప్పలు దర్శనం ఇస్తున్నాయి.

70 శాతం కూడా..

సుమారు పది నెలల క్రితం ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి క్రీడా ప్రాంగణాలు మంజూరు చేసింది. ఒక మైదానం కోసం సుమారు 20 గుంటల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఇప్పటి వరకు 70 శాతం పనులు కూడా పూర్తి కాలేదన్నట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో బోర్డులకే పరిమితమయ్యాయి.

ఆటలకు అనువుగా లేని స్థలం..

కందనెల్లితండాలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసినా పెద్దపెద్ద గుండ్లు ఉన్నాయని, ఆటలకు ఆ స్థలం పనికి రాదంటూ తండా యువకులు స్పష్టం చేస్తున్నారు. గాజీపూర్, మారేపల్లి, బండమీదిపల్లి, ఖాజాపూర్, గోట్లపల్లి, బండపల్లితో పాటు పలు గ్రామాల్లో ఆరు నెలల క్రితం పనులు పూర్తి చేసినా.. నేటికీ డబ్బులు అందలేదని సర్పంచ్‌లు చెప్పారు. క్రీడా ప్రాంగణానికి ప్రభుత్వం సుమారు రూ.2లక్షలకు పైగా నిధులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తే.. పనులపై ఆసక్తి పెరుగుతుందని నిర్మాణదారులు అంటున్నారు.

అప్పులపాలవుతున్నాం



ప్రభుత్వం అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నా సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో పనులు చేసి అప్పుల పాలవుతున్నాం. పల్లె ప్రగతి, రైతువేదిక, జీపీ నుంచి సైడ్ డ్రైన్, క్రీడా ప్రాంగణాలు నిర్మించినా సకాలంలో బిల్లులు రావడం లేదు. తెచ్చిన అప్పులకు నెలకు రూ.2 నుంచి రూ.3 వరకు వడ్డీ చెల్లిస్తున్నాం. మా గోడు ఎవరికి చెప్పినా లాభం లేదు.

– వీరప్ప, సర్పంచ్, గాజీపూర్

త్వరలో పూర్తి చేస్తాం



క్రీడా ప్రాంగణాలు పూర్తి అయిన వాటికి బిల్లుల కోసం ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపాం. అవి వచ్చిన వెంటనే అందజేస్తాం. పనులు ప్రారంభం కాని జీపీల్లో త్వరలో ప్రారంభి, పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. అటవీ భూములు ఉండటం వలన పనులు ఆలస్యం అవుతున్నాయి.

– లక్ష్మప్ప, ఎంపీడీఓ, పెద్దేముల్

కార్యాలయంలోనే కిట్లు


మండల కార్యాలయానికి చేరిన పరికరాలు

మండల పరిధి 37 జీపీలకు 37 క్రీడా మైదానాలు, అనుబంధ గ్రామాలతో కలిపి 43 స్పోర్ట్స్ కిట్లు మంజూరు కాగా.. పది రోజుల క్రితం ప్రభుత్వం వాటిని మండల కేంద్రాలకు పంపిణీ చేసింది. కానీ గ్రామాలకు పంపిణీ చేయలేదు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టినప్పటికీ.. మైదానాలు పూర్తి కాకముందే వాటిని ఏం చేసుకోవాలని పలువురు ప్రశ్నించడంతో పంపిణీ ఆగిపోయినట్లు సమాచారం. ప్రాంగణాల పనులు పూర్తయి, వాటిని ప్రారంభించిన అనంతరం పరికరాలు అందజేయాలని కోరుతున్నారు.

జోరందుకున్న 'ప్రత్యేక' అభివృద్ధి

- రూ.50లక్షల నిధులతో పల్లెల్లో కొనసాగుతున్న డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణాలు


ముద్దాయిపేటలో కొనసాగుతున్న సైడ్ డ్రైనేజీ పనులు

యాలాల: ఎస్‌డీఎఫ్ (ప్రత్యేక అభివృద్ధి నిధులు)లతో మండల పరిధి గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో మంజూరైన గ్రాంట్స్‌తో చేపట్టిన సీసీ, డ్రైనేజీ పనులతో నాయకులు, ప్రజాప్రతినిధులు బిజీగా ఉన్నారు. నిధులు మంజూరైనప్పటికీ.. నిన్న మొన్నటి వరకు స్తబ్దుగా ఉన్నవారు.. ప్రస్తుతం ఏక కాలంలో పనులను నిర్వహిస్తున్నారు.

ఒక్కో జీపీకి రూ.50 లక్షలు

మొయినాబాద్ ఫాంహౌజ్ ఘటన తరువాత సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ప్రాముఖ్యత పెరిగింది. దీంతో నియోజకవర్గానికి రూ.134 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులను ఎమ్మెల్యే సాధించారు. తాండూరు పట్టణంతో పాటు మండలాల పరిధి ప్రతి పంచాయతీకి రూ.50 లక్షల నిధులు కేటాయించారు. యాలాల మండలం రాఘవపూర్, రాస్నం, అచ్యుతాపూర్, ముద్దాయిపేట, దేవనూరు, గోరేపల్లి, సంగెంకుర్దు, కోకట్, ఎన్కెపల్లి, బెన్నూరు, కమాల్‌పూర్‌లో ఎస్‌డీఎఫ్ పనులను వేగంగా పూర్తి చేశారు. మిగితా గ్రామాల్లో సైతం పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఒకేసారి పెద్ద మొత్తంలో పంచాయతీలకు రూ.50లక్షల నిధులు మంజూరు కావడంతో, అవసరమైన చోట సీసీ, సైడ్ డ్రైనేజీ నిర్మాణాలను చేపడుతున్నారు.

హైమాస్ట్ జిగేల్

ఎస్‌డీఎఫ్ నిధులతో ప్రతి పంచాయతీ ప్రధాన కూడలిలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రివేళ ప్రతి గ్రామానికి కొత్త కళ సంతరించుకుంది. మొన్నటి వరకు ఎస్‌డీఎఫ్ బిల్లుల విషయంలో వెనుకడుగువేసి పనులు ప్రారంభించని స్థానిక ప్రజాప్రతినిధులు.. ప్రస్తుతం పనులను వేగంగా పూర్తి చేయిస్తున్నారు.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కేఎస్

చేవెళ్ల: నా గొంతులో ప్రాణం ఉన్నంత వరకు చేవెళ్ల గడ్డకు సేవ చేస్తానని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. చేవెళ్ల మండలంలోని ఓ గార్డెన్‌లో ఆదివారం కేఎస్ రత్నం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంద్రారెడ్డి శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చానని, నాటి నుంచి నేటి వరకు చేవెళ్ల గడ్డపైనే రాజకీయం చేస్తున్నానని, ప్రాణం ఉన్నంత వరకు చేవెళ్ల ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. బీఫామ్‌లు, నామినేటెడ్ పోస్టులు అమ్ముకునే సంస్కృతి తనకు లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. కార్యకర్తలందరూ పార్టీ కోసం పనిచేయాలన్నారు. మాజీ ఎంపీపీ బాలరాజ్, ఎంపీటీసీ కిష్టయ్య ఉన్నారు.

మరపురాని పోరాట యోధుడు



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

గద్దర్ సంతాప సభలో కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: గద్దర్ మరపురాని పోరాట యోధుడని, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన పాడిన పాటలు, చేసిన పోరాటాలు తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, జిల్లా నాయకుడు శంకరయ్య గౌడ్ అన్నారు. ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో మర్పల్లి మండలం సిరిపూరంలో ప్రజాయుద్ధనౌక గద్దర్ సంతాప సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. నేడు గద్దర్ మనమధ్య లేకపోయినా.. ఆయన పాటలు మనమదిలో కలకాలం ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, రాజీరెడ్డి, ఉపాధ్యక్షుడు గోపాల్, నాయకులు సంగమేశ్వర్, నర్సింహరెడ్డి, అనంతయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

జాడలేని ధాన్యం డబ్బులు

- రెన్నెళ్లు గడిచినా రైతుల ఖాతాల్లో జమకాని రుసుం
- సమాధానం దాటవేస్తున్న అధికారులు!
- సివిల్ సప్లై గిడ్డంగిలోనే మూలుగుతున్న ధాన్యం బస్తాలు



ధాన్యం విక్రయించగా.. ఇచ్చిన రసీదు

ధారూరు: ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పిన అధికారులు.. రెండు నెలలు కావస్తున్నా డబ్బులు అందలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ధాన్యం కొనుగోలు డబ్బులు రైతుల ఖాతాల్లో పడకపోవడానికి కారణం అధికారుల తప్పిదమేనని ఆరోపించారు.

అక్కడికి ఎందుకు పంపారు?

ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా జూన్ 25 వరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. ఈ కేంద్రం నుంచి 5 లారీల ధాన్యం సంచులు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని సివిల్‌సప్లై గోడౌన్‌కు చేరాయి. వాస్తవానికి కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించిన ధాన్యాన్ని, నేరుగా రైస్‌మిల్లుకు పంపాలి. మిగతా లారీల ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేరవేసి, కేవలం ఐదు లారీల బస్తాలను మాత్రమే గోడౌన్‌కు ఎందుకు తరలించారని రైతులు ప్రశ్నించారు. ఈ 5 లారీల్లో 2 లారీల ధాన్యాన్ని రైస్‌మిల్లుకు పంపి, మిగతా 3 లారీల వడ్లను ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. ఇందులో ఒక బడా నేత హస్తం ఉందని అనుమానం వ్యక్తంచేశారు.

పెరిగిన వేధింపులు

ప్రస్తుతం మొయినాబాద్ గోడౌన్‌లో 20 మంది రైతులకు సంబంధించిన 890 క్వింటాళ్ల ధాన్యం బస్తాలను రైస్‌మిల్లులకు ఎందుకు పంపించడం లేదని కర్షకులు ప్రశ్నిస్తున్నారు. ఈ 20 మంది రైతులకు రూ.20 లక్షల వరకు రావాల్సి ఉందని, పెట్టుబడులకు అప్పులు చేశామని, సకాలంలో డబ్బులు రాక వడ్డీ పెరగడంతో పాటు.. వడ్డీ వ్యాపారుల వేధింపులు ఎక్కువయ్యాయని వాపోయారు. సివిల్ సప్లై గోడౌన్‌లో ఉన్న ధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపిస్తేనే మీ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు పేర్కొనడం విడ్డూరంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యం డబ్బుల కోసం అధికారులను ఆశ్రయిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఆరోపించారు.

సాకులు చెబుతున్నారు



ధాన్యం విక్రయించి రెండు నెలలు కావస్తోంది. 15 రోజుల తర్వాత విక్రయిన వారికి డబ్బులు వచ్చాయి. మాకు రాలేదు. ఇందులో వివక్ష కన్పిస్తోంది. జూన్ 16న 42.40 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. రూ.87, 344 రావాలి. డబ్బులు అడిగితే మార్కెట్ కమిటీ, సివిల్ సప్లై అధికారులు ఒకరిపై ఒకరు నిందలేసుకుంటూ బుకాయిస్తున్నారు. అధికారుల తప్పిదం వలనే డబ్బులు రావడం లేదు.

–మణెమ్మ, రైతు, కుక్కింద

20 మందికి రావాలి

ధాన్యం విక్రయించిన 20 మంది రైతులకు డబ్బులు రావాలి. ధాన్యాన్ని మొయినాబాద్ సివిల్ సప్లై గోడౌన్‌కు పంపించడం జరిగింది. అక్కడి నుంచి వారు రైస్‌మిల్లర్లకు తరలించాల్సి ఉంటుంది. వారు పంపించక పోవడం వలనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు.

– వెంకటేశ్, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి

సమస్యలు కనిపించడం లేదా?

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లిశంకర్


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: అభివృద్ధిలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపామని గొప్పలు చెపుతున్న పాలకులకు ప్రజా సమస్యలు కనిపించడం లేదా అని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ప్రశ్నించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని రాసుమల్లగూడ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గరవుతున్నారని తెలిపారు. రాసుమల్లగూడ రహదారి బురదమయంగా మారడంతో రైతులు, విద్యార్థులు, గ్రామస్తులు, వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. రాసుమల్లగూడ రహదారి సమస్యను పరిష్కరించకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ నర్సింహులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు హైదర్‌గోరి, శివరాములు, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ కాలనీలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని ఆరోపించారు.

సీఎం సార్ మా సేవలు గుర్తించండి


కొడంగల్: నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎమ్‌లు


అనంతగిరి: మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

కొడంగల్: మండల పరిధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని సెకండ్ ఏఎన్‌ఎమ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సార్.. మా సేవలను గుర్తించండని కోరారు. అనురాధ, తిరుపతమ్మ, అనిత, సులోచన, జయమాల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెకండ్ ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్ పట్టణంలోని గాంధీపార్క్‌లో గాంధీ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడారు. చాలీచాలని వేతనంతో ఏళ్ల తరబడి ప్రజలకు సేవలందిస్తున్న ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించి, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆగస్టు 15 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి లలిత, యాదమ్మ, విజయలక్ష్మి, అమృత, పద్మ, అనంతమ్మ, సత్యమ్మ, అనిత, సుజాత, శంకరమ్మ, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

బంట్వారం: పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు రావడంపై ఆదివారం కోట్‌పల్లి మండలం బుగ్గాపూర్, అన్నాసాగర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

పరిగి: కల్తీ కల్లు తాగి మృతి చెందిన మున్సిపల్ కార్మికుడు రామచంద్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కార్మికుడి మృతదేహానికి పార్టీ నాయకులు నివాళి అర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మృతుడి కుటుంబానికి రూ.10లక్షల పరిహారంతో పాటు 2ఎకరాల భూమిని ఇవ్వాలన్నారు. కల్తీ కల్లు కాటుకు ఎందరో ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చందు, లాలప్ప, జంగయ్యయ, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దోమ: మైలారం గ్రామానికి చెందిన జగదీష్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యులు మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, ట్రస్ట్ సభ్యులు శేరిరాంరెడ్డి, వెంకటయ్య, గోపాల్, రాంచంద్రయ్య, బాలు, రమేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'వీరశైవ' బలోపేతానికి కృషి

సమాజం ఎన్నికల కన్వీనర్ అమర్ లింగస్వామి


నూతన సభ్యులతో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

కొడంగల్ రూరల్: వీరశైవ మహేశ్వర(జంగం) సమాజం బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని సమాజం నారాయణపేట జిల్లా ఎన్నికల కన్వీనర్ అమర్‌లింగస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం కోస్గిలోని ఓ గార్డెన్స్‌లో నియోజకవర్గ జంగం సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడారు. అర్చకులు, పురోహితులు దేవాలయాల్లో భక్తులకు ప్రశాంత వాతావరణం కలిగించేలా కృషిచేయాలని చెప్పారు. సమాజ సభ్యులు ఒకరికొకరు సహకరించుకుంటూ సంఘం బలోపేతానికి పాటుపడాలని కోరారు. అనంతరం నియోజకవర్గ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు

గౌరవ అధ్యక్షుడిగా మల్లికార్జునస్వామి, అధ్యక్షుడిగా హంపయ్యస్వామి(కోస్గి), ప్రధాన కార్యదర్శిగా వీరణ్ణస్వామి(దౌల్తాబాద్), ఉపాధ్యక్షుడిగా వినయ్‌కుమార్‌స్వామి(చిల్‌ముల్ మైలారం), సహాయ కార్యదర్శిగా విజయకుమార్(మద్దూరు), కోశాధికారిగా శ్రీశైలం(కొడంగల్), ప్రచార కార్యదర్శిగా రాచయ్య, సలహాదారులుగా శివకుమార్, జగదీశ్వర్, స్వయంప్రకాష్, శాంతుకుమార్, శశిధర్ స్వామిని ఎన్నుకున్నారు.

నేడు హాత్ సే హాత్ జోడో యాత్ర

ధారూరు: అల్లాపూర్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి పాల్గొననున్నారని, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా అ 'పూర్వ' సమ్మేళనం


ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపికైన వారిని సన్మానిస్తున్న మిత్రులు

దోమ: దాదాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06వ సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా బడి ప్రాంగణంలో సందడి చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తోటి స్నేహితులు రాజు, సంతోష్, బస్వరాజ్ ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో హర్షం వ్యక్తంచేస్తూ.. వారిని సన్మానించారు. పూర్వ విద్యార్థి దాదాపూర్ సర్పంచ్ కృష్ణ పాల్గొన్నారు.